రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్



వార్త

# తీరని శోకం

**మృత్యుశకటమైన లారీ - ఒకే కుటుంబంలో ముగ్గురి దుర్మరణం!**
**రుక్మాపూర్ గ్రామంలో తీరని విషాదం - ప్రాణాలతో బయటపడ్డ బాలుడు**
**కళ్ళ ముందే కన్నవారి మృతితో అనాథగా మారిన కార్తీక్**

**రాత్రంతా పుట్టింటిలో బంధుమిత్రులతో సరదాగా గడిపిన ఆ కుటుంబం.. మరో గంట గడిస్తే తమ నివాసానికి చేరుకునేవారు. కానీ, విధి ఆ కుటుంబాన్ని వదలలేదు. వేగంగా దూసుకొచ్చిన లారీ రూపంలో మృత్యువు వారిని కబళించింది. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామ శివారులో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒకే కుటుంబంలోని ముగ్గురిని బలితీసుకుని, ఆ పచ్చని సంసారంలో నిప్పులు పోసింది.**



తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న కుమారుడు

**పెద్దేముల్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** ఒకే ఒక్క రోడ్డు ప్రమాదం ఒక నిండు కుటుంబాన్ని చిదిమేసింది. జహీరాబాద్‌లో ప్రైవేట్ ఫైనాన్స్‌లో పనిచేస్తూ సంతోషంగా గడుపుతున్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా చీకట్లు అలుముకున్నాయి. తట్టెపల్లి శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురిని బలితీసుకోగా, ఆ ఇంటి చిన్నారి కార్తీక్ పరిస్థితి ఇప్పుడు వర్ణనాతీతంగా మారింది. ఆడుతూ పాడుతూ గడపాల్సిన వయసులో ఆ బాలుడికి తీరని శోకం మిగిలింది. కళ్ల ముందే కన్నతల్లిదండ్రులు, తోడబుట్టిన సోదరి విగతజీవులుగా పడి ఉండటం చూసి 4వ తరగతి చదువుతున్న కార్తీక్ తల్లడిల్లిపోతున్నాడు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి వద్ద జరిగిన ఈ ప్రమాదం స్థానికులను కన్నీరు పెట్టిస్తోంది

**ప్రభుత్వ సహాయం కోసం గ్రామస్థుల విన్నపం**

తట్టెపల్లి రోడ్డు ప్రమాదంలో సర్వం కోల్పోయి అనాథగా మిగిలిన కార్తీక్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని రుక్మాపూర్ గ్రామస్థులు మరియు ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో కోరుతున్నారు. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన ఈ బాలుడికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరిన్ని వివరాలు మెయిన్‌లో

# ఆస్తి ముందు అనురాగం ఆవిరి

**కన్న కూతురు, కోడలి వేధింపులపై వృద్ధ దంపతుల కన్నీటి పోరు!**
**ఐదుగురు సంతానం ఉన్నా అనాథలమయ్యామంటూ కలెక్టరేట్‌లో విలపించిన వృద్ధులు**
**అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ప్రజావాణికి ఫిర్యాదు**
**తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశం**

**కన్న బిడ్డలే కంటిపాపల్లా చూసుకుంటారని ఆశపడ్డ ఆ వృద్ధ దంపతులకు నిరాశే ఎదురైంది. నూరేళ్లు నిండాల్సిన వేళ, ఆస్తి కాంక్షతో కన్న కూతురు, ఇంటి కోడలు కలిసి పెడుతున్న చిత్రహింసలు భరించలేక ఆ వృద్ధ దంపతులు కలెక్టర్ గడప తొక్కారు.**

**నందిగామ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన చింతలపల్లి బుచ్చిరెడ్డి (74), మన్నెమ్మ (70) దంపతుల కన్నీటి గాథ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో అందరినీ కలిచివేసింది.

బుచ్చిరెడ్డి, మన్నెమ్మ దంపతులకు ఐదుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు గతంలోనే మరణించాడు. శేష జీవితాన్ని ప్రశాంతంగా గడుపు దామనుకుంటున్న తరుణంలో ఆస్తి చిచ్చు వీరి ఇంట్లో మొదలైంది. తమ పేరు మీద ఉన్న ఆస్తిని కాజేయాలని చూస్తున్న కన్న కూతురు, కోడలు కలిసి తమను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు కన్నీరు మున్నీరయ్యారు.

**అక్రమ కేసులతో వేధింపులు..**

కేవలం ఆస్తిని తమ పేరిట రాయించుకోవాలనే ఉద్దేశంతో, తాము దాడులు చేస్తున్నామంటూ అక్రమంగా కేసులు పెట్టి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని ఆ వృద్ధులు వాపోయారు. వయసు పైబడిన మమ్మల్ని ఆదుకోవాల్సింది పోయి, ఇంట్లోకి రానివ్వకుండా, తిండి పెట్టకుండా మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారు. సొంత బిడ్డలే మా పాలిట యముళ్లయ్యారు అని వారు జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన దరఖాస్తులో పేర్కొన్నారు.

**కరిగిపోయిన కలెక్టర్..**

వృద్ధ దంపతుల గోడు విన్న జిల్లా కలెక్టర్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి తిరిగి వెళుతున్న బుచ్చిరెడ్డి, భార్య మన్నెమ్మ

తీవ్రంగా స్పందించారు. ఈ వయసులో వారిని వేధించడం క్షమించరాని నేరమని పేర్కొంటూ, తక్షణమే ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని నందిగామ ఆర్డీవోను ఆదేశించారు. వృద్ధుల ఆస్తికి, ప్రాణానికి రక్షణ కల్పించే బాధ్యత అధికారులదేనని, చట్ట ప్రకారం వారికి తగిన న్యాయం చేయాలని సూచించారు. కన్నవారిని కడదాకా కాపాడుకోవాల్సిన బిడ్డలే ఇలాంటి చర్యలకు పాల్పడటంపై స్థానికంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

# కోఆప్షన్ లపై ఉత్కంఠ..

**పదవుల కోసం ఆశావహుల పోటాపోటీ**

**షాద్‌నగర్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీలో నాలుగు కోఆప్షన్ పదవుల భర్తీ ప్రక్రియపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. ఇటీవలే కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుని, చైర్మన్‌గా అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్‌గా అందే మోహన్ ఎంపికయ్యారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం మొత్తం 4 పదవుల్లో రెండు మహిళలకు, మిగిలిన రెండు పదవులను మైనార్టీ మరియు అనుభవజ్ఞుల కోటాలో భర్తీ చేయనున్నారు. మైనార్టీ కోటాలో క్రిస్టియన్ వర్గం నుండి క్రీడాకారుడు చిన్న పేరు, ముస్లిం మైనార్టీ నుండి యువ నాయకుడు ఎండి ఖదీర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. జనరల్ కేటగిరీలో మాజీ సర్పంచ్ సోలిపూర్ శ్రీశైలం గౌడ్ మరియు వావిలాల సుజీవన్ ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వీరితో పాటు రాజేష్ గౌడ్, విజయ్ కుమార్ రెడ్డిలు కూడా రేసులో ఉన్నారు. మున్సిపల్ కార్యాలయం నుండి నోటిఫికేషన్ విడుదలైన ఏడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా, ఎంపికలో కౌన్సిలర్ల మద్దతుతో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి వంటి సీనియర్ నేతల అభిప్రాయాలు కీలకం కానున్నాయి.

## దళిత సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

**మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**

**శామీర్‌పేట, ఏప్రిల్ 13 (ప్రభాతవార్త):** శామీర్‌పేట మండలానికి చెందిన నలుగురు దళితసేన నాయకులకు దళితరత్న అవార్డులు దక్కాయి. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఈ అవార్డులను అందజేసి వారిని ఘనంగా సన్మానించారు. ఈ నెల 5వ తేదీన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జిల్లా స్థాయిలో ఎంపికైన తుంకి బిక్షపతి (మజీద్‌పూర్), ఊరడి వెంకటేశ్ (తుర్కపల్లి), నీరుడి బాలేశ్ (అలియాబాద్), మరియు బి.ఎన్. మదన్ మోహన్ (దేవర యాంజల్) ఈ పురస్కారాలను అందు కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో దళిత సంక్షేమం కోసం మరింత బాధ్యతగా కృషి చేస్తామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సమాఖ్య అధ్యక్షులు బి.ఎన్. రాంమోహన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మెంబర్ ధనాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



దళితరత్న అవార్డులను అందించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## ఇద్దరి ఆస్తులపై సిబిఐ విచారణకు సిద్ధం : మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అవినీతి చిట్టా సీఎం టేబుల్ పైనే ఉందని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ తుక్కుగూడ, ఫార్మాసిటీ సమీపంలో ఎమ్మెల్యేకు వందల ఎకరాల భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మునగనూరులో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి ఆలయం నిర్మిస్తూ, ట్రస్ట్ పేరిట 25 కోట్లు వసూలు చేశారని మండిపడ్డారు. తనపై చేస్తున్న ఆరోపణలపై వచ్చే శుక్రవారం మేడిపల్లికి వస్తున్నానని, దమ్ముంటే ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇద్దరి ఆస్తులపై సీబీఐ విచారణకు తాను సిద్ధమని పేర్కొన్నారు.

## యువతపైనే దేశ భవిష్యత్తు : గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**నందిగామ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** భారత దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉందని, కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో యువతను భాగస్వామ్యం చేయడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. సోమవారం నందిగామ మండలం కన్హా శాంతి వనంలో మేరా యువ భారత్ (తెలంగాణ) ఆధ్వర్యంలో జరిగిన బడ్జెట్ క్విజ్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్ పై నిర్వహించిన పోటీల్లో తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి 1200 మంది యువకులు పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర యువజన శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే. చంద్రా రెడ్డి, మై భారత్ ప్రతినిధులు మరియు యూత్ ఐకాన్స్ పాల్గొన్నారు.



మేరా యువభారత్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్

# ఆర్టీవో ఆఫీస్‌లో అజ్ఞాత రాజ్యం

**కాసుల వేటకు ప్రైవేటు సైన్యం!**



**ఖాకీ డ్రెస్ లేదు.. ఐడీ కార్డు అసలే లేదు..**
**కానీ వసూళ్లలో వీరే బాస్‌లు!**
**రవాణా శాఖ ముసుగులో అక్రమ దందా..**
**ఓవర్ లోడ్ లారీలే వీరి టార్గెట్..**
**వికారాబాద్ జిల్లా రోడ్లపై అడ్డగోలు దందా**

**వికారాబాద్ జిల్లా రవాణా శాఖలో అరాచకం అలుముకుంది. శాఖలో చాలీచాలని సిబ్బంది ఉన్నారనే సాకును అడ్డం పెట్టుకుని, కొంతమంది అధికారులు ఏకంగా తమ విధులను ప్రైవేటు సైన్యానికి లీజుకు ఇచ్చినట్లు కనిపిస్తోంది. జిల్లాలోని ఖనిజ సంపద తరలిపోయే ప్రధాన రహదారులపై ఈ అజ్ఞాత వ్యక్తులు రాజ్యమేలుతున్నారు. ప్రభుత్వ జీతం తీసుకునే అధికారులు ఏసీ గదులకే పరిమితమైతే, ఎలాంటి అధికారిక హోదా లేని ప్రైవేటు రౌడీలు రోడ్లపై వాహనాలను ఆపి దౌర్జన్యంగా వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం. అధికారులు పక్కనే ఉన్నా ఏమీ తెలియనట్లు నటిస్తుండటం చూస్తుంటే, ఈ వసూళ్ల వెనుక ఉన్న పెద్దల హస్తం ఏపాటిదో ఇట్టే అర్థమవుతోంది.**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా రవాణా శాఖలో వింత పోకడలు సాగుతున్నాయి. సిబ్బంది కొరతను సాకుగా చూపిస్తూ, కొంతమంది అధికారులు తమ విధులను ప్రైవేటు సైన్యానికి లీజుకు ఇచ్చినట్లు కనిపిస్తోంది. జిల్లాలోని ఖనిజ సంపద తరలిపోయే ప్రధాన రహదారులపై ఈ అజ్ఞాత వ్యక్తులు రాజ్యమేలుతున్నారు. ప్రభుత్వ జీతం తీసుకునే అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే, ఎలాంటి అధికారిక హోదా లేని వ్యక్తులు రోడ్లపై వాహనాలను ఆపి దౌర్జన్యంగా వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం.

జిల్లాలో ఎర్రమట్టి, నాపరాయి, సుద్ద, కంకర వంటి ఖనిజాలతో పాటు సిమెంట్ ఉత్పత్తులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతం నుంచి నిత్యం వందల సంఖ్యలో లారీలు, కంటైనర్లు, టిప్పర్లు, ట్యాంకర్లు తదితర వాహనాలు రవాణా అవుతున్నాయి. ఒక్కో వాహనానికి పరిమితికి మించిన బరువుతో రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రవాణా అవుతున్న వాహనాలలో 50 శాతం అధిక బరువు కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. కెపాసిటీ 20 టన్నులు ఉండగా 30 టన్నులకు మించి రవాణా చేస్తున్నారు. అదనపు బరువు వాహనాలను రోడ్డుపై నడిపితే రవాణాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలన్న నిబంధనలు ఉన్నాయి. అధిక బరువు వాహనాల వల్ల రోడ్లు ధ్వంసం అవడమే కాకుండా తరచూ ప్రమాదాలకు గురి అవుతూ విలువైన ప్రాణాలను తీస్తున్నాయి. పైగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం అధిక బరువు వాహనాలను నిషేధించింది.

**చీకటి పడితే చాలు.. వసూళ్ల వేట!**

వికారాబాద్ జిల్లాలోని తట్టేపల్లి, పరిగి, నవాబ్ పేట, మర్పల్లి, తాండూరు, కొడంగల్ ప్రాంతాలు ఖనిజ రవాణాకు కేరాఫ్ అడ్రస్. ఎర్ర మట్టి (లేటరైట్), నాపరాయి, సుద్ద, కంకర వంటి ఖనిజాలను మోసుకెళ్లే లారీలు, టిప్పర్లు, కంటైనర్లే ఈ సైన్యం లక్ష్యం. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎలాంటి యూనిఫామ్ లేని ఈ వ్యక్తులు, వాహనాలను అడ్డగించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

**నిబంధనల ఉల్లంఘనలే వీరికి పెట్టుబడి**

జిల్లాలో రవాణా అయ్యే వాహనాల్లో సుమారు 50 శాతానికి పైగా ఓవర్ లోడ్‌తో ప్రయాణిస్తున్నాయి. ఇదే ఈ ప్రైవేటు సైన్యానికి వరంగా మారింది. కేసు రాస్తాం.. భారీ జరిమానా పడుతుంది అంటూ డ్రైవర్లను బెదిరించి, అనధికారికంగా భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. నిబంధనల ప్రకారం చెక్ పోస్టులు ఉండాలి లేదా అధికారులు డ్రెస్ కోడ్‌లో తనిఖీలు చేయాలి. కానీ, ఇవేవీ లేకుండానే ప్రైవేటు వ్యక్తులు జేబులు నింపుకుంటున్నారు.

**అసలు నిబంధనలు ఇలా**

ఓవర్‌లోడ్ వాహనం పట్టుబడితే పర్మిట్ వాల్యువేషన్ కింద రూ.2 వేలు, కెపాసిటీకి మించిన బరువుపై టన్నుకు వెయ్యి రూపాయల చొప్పున పెనాల్టీ వేసే అధికారం ఉంటుంది. అంతే కాకుండా ఆరునెలల పాటు వాహన పర్మిట్లు రద్దు చేయవచ్చు. కానీ జిల్లాలో అలాంటివేమీ కనిపించడం లేదు. దీన్ని అరికట్టేందుకు జిల్లా రవాణాశాఖ అధికారితో పాటు ఎంవీఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

**అధికారుల మౌనం వెనుక అసలు కథేంటి?**

కళ్ల ముందే ఇంత అరాచకం జరుగుతున్నా రవాణా శాఖ అధికారులు మౌనం వహించడం వెనుక ఉన్న మతలబు ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వసూళ్లలో అధికారులకు కూడా వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరత ఉంటే రిక్రూట్మెంట్ చేసుకోవాలి లేదా ఉన్నవారితోనే పనులు నిర్వహించాలి కానీ, ఇలా ప్రైవేటు వ్యక్తులకు రోడ్లను అప్పగించడం ఏంటని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రైవేటు రాజ్యంపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు.

# పర్యవేక్షణ కరువై..

**శామీర్‌పేట ప్రయాణ ప్రాంగణంలో సమస్యల వెతలు**
**పట్టించుకోని హకీంపేట్ డిపో అధికారులు**
**అపరిశుభ్రతతో బూత్ బంగ్లాగా భవనం**

**శామీర్పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కానీ శామీర్‌పేట ఆర్టీసీ బస్ స్టేషన్ దశ మాత్రం మారడం లేదు. రాజీవ్ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఈ బస్టేషన్, అధికారుల నిర్లక్ష్యం వల్ల నేడు నామమాత్రంగా మిగిలిపోయింది. ఒకప్పుడు ప్రయాణీకులతో కళకళలాడిన ఈ ప్రాంతం, నేడు బోర్డులు లేక, రంగులు వెలిసిపోయి విద్దూరంగా దర్శనమిస్తోంది.



కళావిహీనంగా శామీర్పేట ఆర్టీసీ బస్ స్టేషన్

**అయోమయంలో ప్రయాణీకులు**

రాజీవ్ రహదారిపై డివైడర్ నిర్మాణం జరిగినప్పటి నుండి బస్సులు లోపలికి రావడం తగ్గుముఖం పట్టాయి. ఏ బస్సు లోపలికి వస్తుందో, ఏ బస్సు మెయిన్ రోడ్డు పైనుంచి వెళ్లిపోతుందో తెలియక ప్రయాణీకులు లోపలికి, బయటకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల తర్వాత ఏ ఒక్క బస్సు కూడా బస్టేషన్ లోపలికి రాకపోవడం గమనార్హం.



వాడకానికి వీల్లేకుండా ఉన్న మరుగుదొడ్లు

**42 ఏళ్ల చరిత్ర.. నేడు అగమ్యగోచరం**

1978 అక్టోబర్ 5న అప్పటి ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ పి. నర్సింగరావు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. 1983 ఆగస్టు 5న నాటి రవాణా శాఖ మంత్రి ఎస్. సత్యనారాయణ దీనిని ప్రారంభించారు.

**అడుగడునా నిర్వహణ లోపం**

మొదట్లో మేడ్చల్ డిపో పరిధిలో ఉన్నప్పుడు కంట్రోలర్ వ్యవస్థతో బాగుండేది. అయితే, హకీంపేట్ డిపో పరిధిలోకి మారిన తర్వాత పర్యవేక్షణ కరువై శిథిలావస్థకు చేరింది.

**వసతులన్నీ వృథా**

కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన వసతులన్నీ నేడు వృధాగా పడి ఉన్నాయి. ప్రయాణీకుల సౌకర్యార్థం నిర్మించిన టాయిలెట్స్ వాడకానికి వీల్లేకుండా నిర్వీర్యమయ్యాయి. బస్టేషన్ వెనుక ఉన్న టీటీఐల వసతి గదులు శిథిలమై పోయాయి. స్వీపర్లు లేకపోవడంతో ప్రాంగణమంతా చెత్తాచెదారం, స్లాబ్ పిల్లర్లకు బూజు పట్టి బూత్ బంగ్లాను తలపిస్తోంది. ప్రయాణీకులు కనీసం కూర్చోవాలన్నా దుమ్ముతో నిండిన బెంచీలపైనే కూర్చోవాల్సి వస్తోంది. ప్రస్తుతం సిద్దిపేట డిపోకు చెందిన ఒక కండక్టర్ మాత్రమే నాన్‌స్టాప్ బస్సుల టికెట్ల జారీ కోసం ఇక్కడ ఉంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హకీంపేట్ డిపో అధికారులు స్పందించి, శామీర్పేట బస్టేషన్ కు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



తాళం వేసి ఉన్న కంట్రోలర్ గది



వృథాగా పడి ఉన్న టీటీఐల వసతి గదులు





సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## 25 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13 (ప్రభాతవార్త):** జిల్లాలో రబీ 2025-2026 సీజన్‌కు సంబంధించి ఈ నెల 25వ తేదీ నుండి 15 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి వెల్లడించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని శుభ్రం చేసి, ఆరబెట్టి కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను కోరారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపే నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ చేయబడుతుందని, ట్యాబ్ ఎంట్రీలలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల మేనేజర్ సుగుణబాయి, వ్యవసాయాధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

## పజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13 (ప్రభాతవార్త):** జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి మొత్తం 181 దరఖాస్తులు అందాయని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఎంతో నమ్మకంతో తమ సమస్యల పరిష్కారం కోసం వస్తారని, వారి వినతులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఏవైనా కారణాల వల్ల దరఖాస్తులు తిరస్కరణకు గురైతే ఆ విషయాన్ని స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం హౌజింగ్ శాఖకు 48, జిల్లా రిజిస్ట్రార్‌కు 45 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కాంతమ్మ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృత్యువాత

**నిర్మాణ దశలో ఉన్న హైవేపై ప్రమాదం - సూచిక బోర్డులు ఏర్పాటు చేయని కాంట్రాక్టర్**
**- ఏఆర్ జవాన్లకు విశ్రాంతి లేకుండా వరుస డ్యూటీలు- చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి ఫైర్**

**యాలాల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** వరుస విధుల ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం ఓ కానిస్టేబుల్ ప్రాణాన్ని బలిగొన్నది. బషీరాబాద్ మండలం రెడ్డిఘనాపూర్ గ్రామానికి చెందిన ఈరెటిపల్లి నర్సప్ప (40) వికారాబాద్‌లో ఆర్మ్డ్ రిజర్వు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి వరకు చీఫ్ విప్ మహేందర్ రెడ్డికి ఎస్కార్ట్ డ్యూటీ చేసిన ఆయనకు, సోమవారం ఉదయం వెనువెంటనే తాండూరు జాతర బందోబస్తు కేటాయించారు. బైక్ పై విధులకు బయలుదేరిన నర్సప్ప, యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టును గమనించక నేరుగా గోతిలో పడిపోయారు. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు తీవ్ర గాయమై ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, భార్య నవనీత కన్నీరు మున్నీరుగా విలపించింది. తన సిబ్బందికి విశ్రాంతి లేకుండా వరుస డ్యూటీలు వేయడంపై చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పోలీసు శాఖ తీరుపై మండిపడ్డారు.



## మంబాపూర్‌లో వైభవంగా రక్తమైసమ్మ జాతర

**పెద్దేముల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో రక్తమైసమ్మ జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున భోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. డోలు వాయిద్యాల మధ్య శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు భక్తులను ఎంతగానో అలరించాయి. పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

